

నేడు స్టాఫ్ నర్సుల సర్టిఫికెట్ల పరిశీలన

నిర్మల్ కల్చరల్, జనవరి 28: జిల్లాలో నూతనంగా ఎంపికైన 161 మంది స్టాఫ్ నర్సుల సర్టిఫికెట్ల పరిశీలన, గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ సోమవా రం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన స్టాఫ్ నర్సులు ఉదయం 9 గంటలకు వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయం, ఐడీవోసీ నిర్మల్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే ఎంపికైనవారు ఈనెల 31న ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.



మామడలోని న్యూసాంగ్వీలో అక్రమంగా పొందిన డీ-1 పట్టా భూములు ఇవే..

అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిద్దిలకుంట గ్రామస్థులు (ఫైల్)

అక్రమ పట్టా భూముల వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

కలెక్టరేట్‌ను ముట్టడించిన సిద్దిలకుంట గ్రామస్థులు (ఫైల్)

డీ-1 వ్యవహారం ఏసీబీకి!

- సూత్రధారులైన అధికారుల బినామీ ఆస్తులపై ఆరా
- కుప్పలు తెప్పలుగా ఫిర్యాదుల వెల్లువ
- సీఎం, డిప్యూటీ సీఎంలకు ఎమ్మెల్యే ఫిర్యాదు
- ధరణి కమిటీ దృష్టికి సైతం
- రెండు మూడు రోజుల్లో మొదలుకానున్న రహస్య విచారణ
- ఇప్పటికే పూర్తి వివరాలను సేకరించిన ఉన్నతాధికారులు
- కలెక్టర్ ఆధీనంలోకి రికార్డులు

నిర్మల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన డీ-1 పట్టాల అక్రమాల వ్యవహారాన్ని స్థానికులు కొంతమంది ఏసీబీ దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమ పట్టాల జారీకి సంబంధించి ఫైల్ నంబర్‌లతోపాటు భూముల వివరాలు ఆ తర్వాత ఆ పట్టాలపై జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలతో సహా ఏసీబీకి ఫిర్యాదు అందినట్లు చెప్తున్నారు. ఇప్పటికే నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి డీ-1 పట్టాల అక్రమాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ కోరిన సంగతి తెలిసిందే. అలాగే ఎమ్మెల్యే డీ-1 పట్టాల అక్రమాలకు సంబంధించిన వివరాలు, ఆ భూములను కైంకర్యం చేసుకున్నా అప్పటి బీఆర్ఎస్ నేతల బంధువుల వివరాలను పూర్తిగా సేకరించి ఆ వివరాలతో సీఎం, డిప్యూటీ సీఎంలకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అలాగే కొంతమంది సమాచార హక్కు చట్టం సభ్యులు ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు నేరుగా అన్ని వివరాలతో ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఏసీబీ అధికారులు బాధ్యులైన సంబంధిత శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులపై రహస్య విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఇద్దరి ఆస్తులు అలాగే వారి బినామీలపై కూడా రహస్యంగా విచారణ మొదలైనట్లు చెబుతున్నారు. 2014 నుంచి 2018 వరకు జరిగిన ఈ అక్రమ డీ-1 పట్టాల దందాల్లో వీరిద్దరే ప్రధాన సూత్రధారులన్న ఆరోపణలున్నాయి. వీరిపై ఇప్పటికే కలెక్టర్‌కు అలాగే ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు అందినా వీరికున్న రాజకీయ పలుకుబడి కారణంగా ఇప్పటివరకు విచారణ జరగలేదంటున్నారు. ఈ వ్యవహారం పతాకస్థాయికి చేరుకోవడం, అలాగే ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించడంతో పలు ప్రజాసంఘాల సభ్యులు, సమాచార హక్కు చట్టం సభ్యులు సైతం వీరిపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇలా కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు రావడంతో ఏసీబీ మొత్తం ఈ వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. అక్రమార్కుల ఆస్తులను వెలికి తీసేందుకు వారి ఆధార్ నంబర్‌లతో పాటు సన్నిహితంగా ఉన్న వ్యక్తుల ఆధార్ నంబర్‌లను సేకరించి మొత్తం ఆస్తుల గుట్టు విప్పబోతున్నారంటున్నారు. అలాగే భూముల అక్రమాలకు ఆస్కారమిచ్చినట్లు ఆరోపణలపై విచారిస్తున్న ధరణి కమిటీకి సైతం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారంటున్నారు. కొద్ది రోజుల్లోనే డీ-1 పట్టాల అక్రమాలపైనే కాకుండా అప్పటి బీఆర్ఎస్ నేతల పాత్రపైనా, వారి బినామీలకు సంబంధించి పూర్తివివరాలు వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు డీ -1 బాధితులు, ప్రతిపక్ష నేతలు ఈ అంశంపై ఫిర్యాదులు చేస్తున్నప్పటికి విచారణ అనంతరం పూర్తి వివరాలు బహిర్గతమయ్యే అవకాశం ఉందంటున్నారు.

మొదలైన కలెక్టర్ విచారణ..

ఎమ్మెల్యే ఫిర్యాదుతోపాటు ప్రతీ సోమవారం జరిగే ఫిర్యాదుల విభాగంలో డీ-1 పట్టాల అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడం, పలు గ్రామాల్లో ఆందోళనలు జరుగుతుండడాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే కలెక్టర్ డీ-1 పట్టాలకు సంబందించిన పూర్తి వివరాలను సేకరించడమే కాకుండా సంబంధిత ఆఫీసుల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు. ఆ రికార్డులను ఆధారంగా చేసుకొని గ్రామాల వారిగా అనుమతినిస్తున్నట్లు సమాచారం. కలెక్టర్ చేపట్టిన విచారణ రహస్యంగా జరుగుతున్నట్లు చెబుతున్నారు. సంబంధిత శాఖల్లోని అధికారులు, సిబ్బందికి కూడా లీక్ కాకుండా కలెక్టర్ తనదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ విచారణ అంశం తెలుసుకున్న కొంతమంది అప్రమత్తమై రాజకీయ అండదండల కోసం పైరవీలు మొదలుపెట్టారంటున్నారు.

బీఆర్ఎస్ నేతలు, బంధువులపైనా ఆరోపణలు

డీ-1 పట్టాల భూముల అవకతవకల వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ నేతలు వారి బంధువుల ప్రమేయం ఉన్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. ఎన్నికలకు ముందు నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఇదే అంశంపై పెద్దఎత్తున విమర్శలు చేస్తూ ఎదురుదాడి కొనసాగించారు. అప్పటి బీఆర్ఎస్‌కు సంబంధించి కొంతమంది నేతల భూముల అవకతవకలపై విచారణ చేపట్టాలంటూ కూడా ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల్లో ఇదే అంశాన్ని ఆయన ప్రచారాస్త్రంగా కూడా మలుచుకున్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే డీ-1 పట్టాల అక్రమాలపై చర్యలు జరిగేట్లు చేస్తానంటూ కూడా ఎమ్మెల్యే ప్రజలకు హామీనిచ్చారు. ఆయన హామీ ఇచ్చినట్లుగానే దాదాపు 50వేల మెజార్టీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట ఆయన డీ-1 పట్టాల వ్యవహారాన్నే ప్రధాన అంశంగా చేస్తూ మాట్లాడారు. ఎమ్మెల్యే సీరియస్‌గా వ్యవహరిస్తుండడం, కలెక్టర్ సైతం విచారణ మొదలుపెట్టడంతో భూముల అక్రమాలకు పాల్పడిన పలువురు రాజకీయనేతలు మరోసారి పైరవీలకు శ్రీకారం చుట్టారంటున్నారు. కొంతమంది అక్రమార్కులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు కూడా ప్రయత్నాలు జరుపుతున్నారన్న ప్రచారం మొదలైంది. అయితే మొదటి నుంచి నిక్కచ్చిగా వ్యవహరించడం, ఒత్తిళ్లకు, పైరవీలకు ఆస్కారమివ్వని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి వీరి ఒత్తిళ్ళను పరిగణలోకి తీసుకోవడం లేదంటున్నారు. ఈ అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తాను ఈ అంశాన్ని విడిచి పెట్టేది లేదంటూ ఎమ్మెల్యే బహిరంగంగా ప్రకటిస్తుండడం అక్రమార్కుల్లో దడ లేపుతోంది.

కలెక్టర్ ఆధీనంలోకి రికార్డులు

డీ-1 పట్టాల అక్రమాలపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తుండడం అలాగే సంబంధిత శాఖల ఉద్యోగులపై సైతం ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు చెబుతున్నారు. 2014 నుంచి జిల్లావ్యాప్తంగా జరిగిన డీ-1 పట్టాలు, రిజిస్ట్రేషన్‌లు ఇతర అన్నిశాఖలకు సంబంధించిన రికార్డులన్నింటినీ కలెక్టర్ ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారంటున్నారు. ఒకరిద్దరు విశ్వసనీయత గల అధికారుల చేత ఆయన రికార్డులకు సంబంధించి పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్నారంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సీఎం, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేయడం అలాగే నిఘా సంస్థలు సైతం ఈ దిశగా దృష్టిసారించడాన్ని కలెక్టర్ పరిగణలోకి తీసుకొని తనదైన శైలిలో చర్యలు మొదలుపెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి అవసరమైతే ఓ కమిటీని కూడా నియమించేందుకు కలెక్టర్ సిద్ధమవుతున్నారంటున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ వ్యవహారం అసలు విషయాలన్నీ బయటికొస్తాయని ప్రచారం సాగుతోంది.



సమావేశంలో పాల్గొన్న అరే మరాఠా సంఘ ప్రతినిధుల బృందం

ఆరె మరాఠాల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, జనవరి28: ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా ఆరెమరాఠాల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం భైంసా మండలంలోని మహాగావ్ గ్రామంలో జరిగిన సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘబలోపేతం, సభ్యుల అభ్యున్నతియే ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామ, మండల, డివిజన్ కమిటీలు తమ ప్రాంతాల్లో సంఘాలను మార్గదర్శకమైన తీరుతో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అర్హులైన సంఘ సభ్యులందరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందింపచేసేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు జేకే పాటిల్ మాట్లాడుతూ సంఘాల సభ్యులందరూ ఒకరి కష్ట, సుఖాల్లో మరొకరు పాలుపంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహాగావ్ గ్రామ ఆరె మరాఠా సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో సంఘ డివిజన్ అధ్యక్షులు కే.రఘువీర్ పాటిల్, భైంసా గౌరవ అధ్యక్షులు జాదవ్ పుండలీక్‌రావ్, వివిధ మండలాల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. మహాగావ్ గ్రామ సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎస్.సురేష్ పాటిల్, అధ్యక్షుడిగా ఎస్.విఠల్ పాటిల్, ఉపాధ్యక్షుడిగా జె.ఉదయ్ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా గణేష్ పాటిల్, సహ కార్యదర్శిగా బాలాజీ పాటిల్, కోశాధికారిగా ఓంకార్ పాటిల్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముథోల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

ముథోల్, జనవరి28: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ సెలక్షన్స్‌లలో ముథోల్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సాయిచరణ్, గణేష్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అమీర్ కుస్రో, పీడీ శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల తూప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో పాల్గొంటారు. వీరిఎంపిక పట్ల స్థానిక సర్పంచ్ రాజేందర్, స్థానిక నాయకులు అఫ్రోజ్ ఖాన్, శ్రీనివాస్ గౌడ్, భూమేష్, కోఆప్షన్ మెంబర్ మకదూం, పాఠశాల చైర్మన్ గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, జనవరి28: నిర్మల్ పట్టణం గుల్జార్ మార్కెట్‌లో ఆదివారం ఆదిత్య స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండెవ్యాధి చికిత్సలు నిర్వహించారు. డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ... గుండెలో నొప్పి వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నడిస్తే దమ్ము వచ్చినా, బీపీ, మధుమేహం తదితర పరీక్షలు తప్పనిసరి చేయించుకోవాలన్నారు. 2డీ ఎకో పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్సకోసం సిఫార్సు చేశారు. 200 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ తాహిద్‌ఉద్దీన్, డాక్టర్ రవీందర్, షహీన్ హష్మీ, ఫారుక్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- టీయూజేఏసీ చైర్మన్ కిరణ్ రెడ్డి

నిర్మల్‌కల్చరల్, జనవరి28: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించినవారిని ఆదుకోవాలని టీయూజేఏసీ చైర్మన్ కిరణ్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మల్ టీఎన్జీవో సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నివర్గాల కృషివల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోలేదని ఆరోపించారు. ఉద్యమ ద్రోహులకు ప్రాధాన్యమిచ్చారని ఉద్యమకారులని విస్మరించారన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించి ఇంటి స్థలం, 25వేల రూపాయల పెన్షన్, ఉచిత బస్సు పాస్ సౌర్యం కల్పించడంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో 20 శాతం ఉద్యమకారులకు అవకాశం ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో నాయకులు కలీం, షరీఫ్, సాయికృష్ణ, శివాజీ, తదితర నాయకులు పాల్గొన్నారు.



కిరణ్ రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యమకారులు

అడెల్లి ఆలయంలో మహాపోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, జనవరి28: మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులను మొక్కారు. అమ్మవారికి పెరుగన్నంను నైవేద్యంగా సమర్పించి కానుకలను హుండీలలో వేశారు. జాతకాన్ని సరిచూసుకున్నారు. దీంతో ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చినటువంటి భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందు, ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్‌గౌడ్ అన్ని చర్యలు చేపట్టారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి పరామర్శ

నిర్మల్ కల్చరల్, జనవరి28: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ తండ్రి ఇటీవల మృతి చెందగా ఆయనను డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఆదివారం పరామర్శించారు. చొప్పదండి నియోజకవర్గం కొలిమికుంట గ్రామంల్లో మల్లేష్‌ను కలిశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కిరాణా అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్‌కల్చరల్, జనవరి28: నిర్మల్ కిరాణా అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా ఆమెడ శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పడిగెల లక్ష్మీనారాయణ, కోశాధికారిగా పూర్ణేందర్, గౌరవ అధ్యక్షుడిగా పోలిశెట్టి సురేందర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.నాగనాథ్, తోట చంద్రశేఖర్, జాప శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా చౌడారపు రమేష్, నారాయణ, ఎన్నికయ్యారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టు

కుభీర్, జనవరి28: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్సై ఎండీ షరీఫ్ అన్నారు. గత 15 రోజులుగా మణికంఠ క్రికెట్ టీం ఆధ్వర్యంలో కుభీర్‌లో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 65 టీంలు పాల్గొనగా భైంసాకు చెందిన ఎఫ్‌ఎఫ్‌సీ టీం మొదటి విజేతగా, రెండవ విజేతగా భైంసాకు చెందిన జాగ్వార్ టీం నిలిచింది. మొదటి విజేతకు రూ. 21వేల నగదు, రెండవ విజేతకు రూ. 11వేల నగదుతో పాటు కప్పును అందజేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మోహియోద్దిన్, నాయకులు వడ్నం నాగేశ్వర్, ప్యాట లక్ష్మణ్, ఎన్నిల అనీల్, విజయ్‌కుమార్, వివేకానంద్ ఉన్నారు.

నిర్మల్‌లో లెనిన్ వర్ధంతి సభ

నిర్మల్‌కల్చరల్, జనవరి28: సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్‌కు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. నూతన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య హాజరై మాట్లాడారు. లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు గౌతమ్ కృష్ణ, బొమ్మెన సురేష్, డాకూరి తిరుపతి, శంఖు, బక్కన్న, డి. పోశెట్టి, వెస్లీ, రాజమణి, లలిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు

రేషన్‌కార్డు ఈ-కేవైసీ గడువు పొడిగింపు



ఈ-కేవైసీ చేస్తున్న దృశ్యం

భైంసా, జనవరి 28: రేషన్ కార్డుల ఈ-కేవైసీ గడువును కేంద్ర ప్రభుత్వం మరోనెల రోజుల పాటు పొడిగించింది. ప్రస్తుత గడువు ఈనెల 31తో ముగియనుంది. అన్ని ప్రాంతాల్లో సంబంధిత ఈ-కేవైసీ గడువు ప్రక్రియ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డులను ఆధార్ నెంబరుతో అనుసంధానించే గడువు ప్రక్రియను ఫిబ్రవరి నెలఖారు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో మొత్తం 412 రేషన్ దుకాణాలు ఉండగా మొత్తం 2,08,487 రేషన్ కార్డులున్నాయి. వీటిల్లో మొత్తం 6,41,987మంది సభ్యులు ఉండగా ఇప్పటివరకు 4,79, 329 మందితో 74.67 శాతం మాత్రమే ఈ-కేవైసీ పూర్తయ్యింది. ఇంకా 1,62,658 మంది సభ్యులు ఈ - కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుత గడువు పెంచిన నేపథ్యంలో మిగిలిన 25.33 శాతం మంది సభ్యులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు అవకాశం కలిగింది. ఫిబ్రవరి నెలఖారు వరకల్లా ఈ-కేవైసీ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ గడువు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

కేటీఆర్ మానసిక స్థితి బాగాలేకే దిగజారుడు వ్యాఖ్యలు

- తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి వినోద్ కుమార్

ముథోల్, జనవరి28: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను పదేళ్ల మర్చిపోయి రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన కేసీఆర్ కుటుంబం నేడు అధికారం కోల్పోయేసరికి ఆగమాగమై అరుస్తున్న తీరును చూసి తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారని, కేటీఆర్ మానసిక స్థితి బాగాలేకే దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఉందని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులను రాష్ట్రం ఏర్పడ్డాక అవమానించి అణచివేసిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించినా బుద్ధి మారలేదని, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన తెలంగాణ జన సమితి అధినేత కోదండరాం నియామకం పట్ల దిగజారుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని తెలిపారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులను ప్రజాప్రభుత్వం గౌరవిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ అసూయతో అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ తీరు మార్చుకోకపోతే పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

నిర్మల్ కల్చరల్, జనవరి 28: కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్న యాదవ్, జే.లక్ష్మణ్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆరు నెలలుగా వారికి వేతనాలు చెల్లించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సీఆర్టీల వేతనాలు కూడా సకాలంలో చెల్లించాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై

కుంటాల, జనవరి 28: నేటి సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల గ్రామీణ ప్రాంత యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. ఆదివారం కుంటాల మండలంలోని లింబా(కె) గ్రామంలో ప్రజలకు ఆన్‌లైన్‌మోసాల పట్ల అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నారని వీటిని అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండడంతోపాటు మోసం జరిగిన వెంటనే 1030కు సమాచారం అందిస్తే 24గంటల్లో జరిగిన మోసాన్ని అరికట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అంతేగాకుండా గ్రామాలలో ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని, వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థులందరూ స్వచ్ఛందంగా ముందుకుగా వచ్చి వారం రోజుల్లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారని చెప్పారు.



యువకులకు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎస్సై హన్మాండ్లు

పీటీజీల కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్

తలమడుగు, జనవరి 28: వెనుకబడ్డ ఆదివాసీ కోలాం గిరిజనుల (పీటీజీ) కోసం మండలకేంద్రంలో ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వీటిని మండలంలో గల కోలాం గిరిజనులు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శనివారం మండల కేంద్రలోని గ్రామ పంచాయతీలో ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఆధార్ తప్పనిసరి కావడంతో కోలాంగిరిజనులు రెన్యూవల్ చేసుకోక పోవడంతో వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆధార్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో గల ఆదివాసీ కులం గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అదేవిధంగా ఆధార్ సెంటర్‌లో ఎలాంటి రుసుము చెల్లించిన అవసరం లేదని, ఉచితంగానే ఆధార్ అందించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు సెంటర్‌ను మండల కేంద్రంలో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంపీడీవో రమాకాంత్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, సెక్రెటరీ అశోక్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ సెంటర్‌లో పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజమోహన్



ధృవీకరణ పత్రాలను స్వీకరిస్తున్న భైంసా గాయకులు

ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో భైంసా మహిళా గాయకులకు చోటు

భైంసా, జనవరి 28: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని నలుగురు మహిళా గాయకులు ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటుదక్కించుకున్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం శ్రీ నృసింహ సేవావాహిని గోవింద కల్పవృక్ష సాలగ్రామ ఆశ్రమంలో 108 గాయకులచే 12 గంటలు నిర్విరామ భక్తి గీతా స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎస్ 24 టీవీ వేల గొంతుకల వేదిక ఆధ్వర్యంలో ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు కోసం ఈ స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భైంసా పట్టణానికి చెందిన మియపూరం వాణి, అర్.సుప్రియ, ఆర్తీ, దేవకి దేవిలు పాల్గొని నిర్విరామంగా మరో 104 మంది గాయకులతో కలిపి 12 గంటల పాటు నిర్విరామంగా భక్తి గేయాలను ఆలపించి ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు నిర్వాహక ప్రతినిధులు స్వరార్చనలో పాల్గొన్న గాయకులందరికి ధృవీకరణ పత్రాలను అందచేసి జ్ఞాపికలను బహూకరించి సన్మానం చేపట్టారు.

డీడీఎన్ అర్చక జిల్లా అధ్యక్షుడిగా యోగేష్ శర్మ



ఎన్నికల్లో పాల్గొన్న అర్చకులు

నిర్మల్ కల్చరల్, జనవరి28: ధూపదీప నైవేద్య అర్చక జిల్లా అధ్యక్షుడిగా యోగేష్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని దేవరకోట శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో రాష్ట్ర నాయకులు, ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించి ఏకగ్రీవంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సిరిగే నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జంగం లక్ష్మణప్ప, జిల్లా అధికార ప్రతినిధిగా కులకర్ణి సంతోష్, ఉపాధ్యక్షుడిగా ద్యావ అర్జున్, జంగం మహంతయ్య, జి. రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా జంగం మహేష్, కోశాధికారులుగా విజయ్ కుమార్, జంగం విశాల్, ప్రచార కార్యదర్శిగా నరసింహ స్వామి, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రశాంత్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన యోగేష్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని, అర్చకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వంతో కలిసి పోరాడుతామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2000-2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కుభీర్, జనవరి 28: మండల కేంద్రం కుభీర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001వ బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వసమ్మేళనం ఏర్పాటుచేశారు. 23 సంవత్సరాల తర్వాత అప్పటి పదోతరగతి విద్యార్థులందరూ తాము చదువుకున్న పాఠశాలలో ఏకమైయ్యారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. తమకు చదువుచెప్పిన గురువులను సమావేశానికి ఆహ్వానించి ఆశీస్సులు పొందారు.

గిరిధారి సాధు బృందం సభ్యులు నిర్మల్ రాక

నిర్మల్ కల్చరల్, జనవరి 28: ఉత్తర ప్రదేశ్ మధుర అమరజ్యోతి గోవర్ధన దారి ఆశ్రమానికి చెందిన గిరిధారి సాధు బృందం ఆదివారం నిర్మల్ చేరుకున్నారు. వీరిని పాకాల రాంచందర్ కలుసుకొని సాదర స్వాగతం పలికి సన్మానించారు. లోక కళ్యాణాని కోసం సంచార యాత్ర చేపట్టినట్లు సాధు బృందం తెలిపింది.



ఎస్టీయుూ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రాజకీయాలను శాసించే స్థాయికి ఉద్యోగ సంఘాలు : ఎమ్మెల్యే అనిల్

బోథ్, జనవరి 28: ఉద్యోగుల నుంచి బలవంతమైన రాజకీయం ఎదుగుతుందని ఉద్యోగ సంఘాలు బలోపేతం అయితే రాజకీయాలను శాసించే స్థాయికి ఎదుగుతాయని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎస్టీయూ టీఎస్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా ఎదిగిన వారు అధిక శాతం ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ సంఘాలు బలపడి రాజకీయాలను శాసించే స్థాయికి వస్తాయన్నారు. రాజకీయాలకు, ఉద్యోగులకు విడదీయరాని బంధం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో భవన నిర్మాణానికి అవసరమైన నిధులు 5లక్షల మేరకు మంజూరు ఇస్తామన్నారు. తాను ఉద్యోగ సంఘాల వారికి ఉద్యోగులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గం ఒక వంద 30కిలో మీటర్లు విస్తరించి ఉందని ఇందులో అనేక రకాల రాజకీయ పార్టీల నాయకులు ఉద్యోగ సంఘాల వారు ఉన్నారని నియోజకవర్గ అభివృద్ధికి అన్ని వర్గాల వారిని కలుపుకొని పోతామన్నారు. సమావేశంలో టీఎస్ ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం భవనాలు 27 ఉన్నాయన్నారు. పెద్దమొత్తంలో సభ్యత్వం ఉందని ఆది నుంచి ఉపాధ్యాయుల సమస్యలను పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుశ్రీనివాస్, జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి రఫీ. ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రమణ గౌడ్, కౌట(బి) గ్రామ వీఆర్ఎస్ నాయకులు డాక్టర్ స్వామితో పాటు ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన

● ఈ నెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీకాలం ● జిల్లాలో 468 పంచాయతీలు ● పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తారా?

ఉట్నూర్, జనవరి 28: గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనుండడంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనుంది. గ్రామ పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు జరుగుతాయని భావించినప్పటికీ ఎన్నికల నిర్వహణకు ఇంకా సమయం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి రెండు నుంచి పంచాయతీలకు స్పెషల్ అధికారులను అందుబాటులోకి తేవడానికి కసరత్తు పూర్తి చేశారని తెలుస్తోంది. ఈ మేరకు కలెక్టర్ జిల్లాలోని మండలాల వారీగా పనిచేస్తున్న అధికారుల జాబితాలను సేకరించారు.

● వీరే ప్రత్యేక అధికారులు

జిల్లాలోని 18 మండలాల్లో ఉన్న 468 గ్రామ పంచాయతీలకు ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈఈలు, ఎంఈవోలు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, హార్టికల్చర్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎంపీడీవో కార్యాలయాల సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలు, టైపిస్టులు, ఏపీఎంలు, ఏపీఓలు, రికార్డు అసిస్టెంట్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు.

● పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తారా..?

గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు జాప్యం వస్తున్నందున ప్రభుత్వం పర్సన్ఇన్‌చార్జీలను నియమిస్తుందా అన్న అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



జైత్రామ్ తండా జీపీ ఆఫీస్

ప్రస్తుతం పనిచేస్తున్న సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమిస్తారని భావిస్తున్నప్పటికీ అధికంగా ఉన్న సర్పంచ్‌లందరూ అధికార పార్టీకి కాకుండా విపక్ష పార్టీలకు చెందిన వారు ఉండడం వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోదని పరిశీలకులు భావిస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీల ఎన్నికలు ఆలస్యంగా నిర్వహించే అవకాశాలు ఉన్నప్పుడు గత ప్రభుత్వాలు తమ పార్టీలకు చెందిన గ్రామస్థాయి నాయకులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నామినెటెడ్ చేసింది. ఇదే అనవాయతిని కొనసాగించాలనుకుంటే అధికార పార్టీకి కలిసి వస్తుందని ప్రజలు భావిస్తున్నారు.



గ్రామాలలో సర్పంచులు వేయించిన హైమాస్ లైట్లు

● ఇబ్బందుల్లో సర్పంచ్‌లు

గ్రామ పంచాయతీల ఎన్నికలను ప్రభుత్వం సకాలంలో నిర్వహిస్తే తాముకూడా రెండవసారి సర్పంచ్‌లుగా ఎన్నికయ్యే వారమని, ఎన్నికలు నిర్వహించ కుండానే ప్రత్యేక అధికారులను నియమిస్తున్నడం వల్ల తాము చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయక పోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డామని సర్పంచ్‌లు మదన పడుతున్నారు. ప్రజల సౌకర్యాల కోసం రోడ్లు, మురికి కాలువలు, హైమా స్‌లైట్లు, తదితర అవసరాలను తీర్చడానికి అప్పులు చేసి ఖర్చులు పెట్టిన బిల్లులను ప్రభుత్వం ఇవ్వక పోవడంతో తమనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమిస్తే బాగుండేదని సర్పంచ్‌లు భావిస్తున్నారు.

● జిల్లాలో 468 పంచాయతీలు

ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలలో మొత్తం 468గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

మండలం	పంచాయతీలు
ఉట్నూర్	37
ఇంద్రవెల్లి	28
నార్నూర్	23
గాదిగూడ	25
సిరికొండ	19
ఆదిలాబాద్‌రూరల్	34
బజార్‌హత్నూర్	30
బేల	37
భీంపూర్	26
బోథ్	33
గుడిహత్నూర్	26
ఇచ్చోడ	32
జైనథ్	42
మావల	03
నేరడిగొండ	32
తలమడుగు	28
తాంసి	13



సర్పంచులని పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలి

● జాదవ్ సునిల్‌నాయక్, సర్పంచ్, నాగాపూర్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుత సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలి. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయక పోవడంతో చాలామంది సర్పంచులు ప్రజల అవసరాల కోసం పనులు చేయడానికి అప్పులపాలు అయ్యారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారులు

● బొమ్మ భిక్షపతిగౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి, ఉట్నూర్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరి రెండు నుంచి ప్రత్యేక అధికారులు వస్తున్నారు. ఈ నెలాఖరుతో సర్పంచు పదవీకాలము గిసిపోతుంది. ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీలకు నియామకమైన అధికారులు బాధ్యతలు తీసుకుంటారు.




జాతరెల్లి పోదామో.. జాతరో జాతర!!



పూసాయి ఎల్లమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు

ఆదిలాబాద్ జిల్లాలో జాతరలకు జనం అధికం ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా జైనథ్ మండలంలో రెండువారాల పాటు సాగే పూసాయి జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలి వస్తున్నారు. ఇదేక్రమంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున ప్రవహించే పెన్‌గంగా నదిలో ఆదివారం నుంచి జాతర ప్రారంభమైంది. మరోపక్క రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర కూడా అతి త్వరలోనే ప్రారంభంకానుంది. ఇప్పటికే మెస్రం వంశీయులు గంగాజలం కోసం పయనమయ్యారు. జాతరెల్లి పోదామో.. జాతరో జాతర అంటూ ముందుకు సాగుతున్న ఆదివాసీ గిరిజనులను ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించిదిలా..

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



జైనథ్ మండలంలో పూసాయి గంగాజాతర ప్రారంభం సందర్భంగా భక్త జన సందోహం



జాతరలో గంగమ్మతల్లికి నైవేద్యాలు చేస్తున్న మహిళలు, భక్తులు



పూసాయి ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



నాగోబా జాతర సందర్భంగా గంగనీళ్ల కోసం వెళ్తున్న మెస్రం వంశీయులు



హస్తినమడుగు వద్ద పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



గంగాజలం తీసుకుని వెళ్తున్న మెస్రం వంశీయులు

గోదావరి రేవులో మెస్రం వంశీయుల పూజలు

● పవిత్ర గంగాజలంతో తిరుగు పయాణం

జన్నారం, జనవరి 28: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి రేవులోని హస్తినమడుగులో ఆదివారం మెస్రం వంశీయులు పూజలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలోని నాగోబాకు హస్తినమడుగు నుంచి గంగాజలం తీసుకువెళ్లి అభిషేకం చేస్తారు. ఇందులో భాగంగా ఈనెల 21న కేస్లాపూర్ నుంచి కాలినడకన బయలుదేరిన మెస్రం వంశీయులు సుమారు 200మంది ఆదివారం కలమడుగు గోదావరి రేవుకు చేరుకున్నారు. గోదావరి రేవులోని హస్తినమడుగులో స్నానం చేసి అనంతరం పితృదేవతలకు పూజలు చేశారు. నాగోబాకు అభిషేకం చేసేందుకు వెంట తెచ్చిన ఝరిలో గంగాజలం సేకరించారు. సహపంక్తి భోజనాలు చేసిన అనంతరం సేకరించిన గంగాజలంతో తిరుగు ప్రయాణమయ్యారు. ఫిబ్రవరి 9వ తేదీన నాగోబా ఆలయానికి చేరుకుని అదే రోజు రాత్రి నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం చేసిన తర్వాత జాతర ప్రారంభమవుతుందని మెస్రం వంశం ప్రధాన్ దాదారావు, కరోడ మెస్రం కోసురావు, మెస్రం కోసు, కొత్వాల్ హన్మంతరావు, మెస్రం తిరుపతి, తదితరులు తెలిపారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, జనవరి 28: రైతులు దళారులను నమ్మి మోసపోవోద్దని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను వ్యవసాయ మార్కెట్‌లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఖనాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్ కోరారు. స్థానిక మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ద్వారా చేపట్టనున్న కందుల కోనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, మార్క్ ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అంజద్, సీఈవో ధర్మసింగ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజేశ్వర్, మండల కోఆప్షన్ సభ్యులు మీర్జా జీలానీ బేగ్, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్ రావు, సహకార సంఘం సిబ్బంది తుమ్మల సునీల్ కుమార్, లక్ష్మణ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

● 'ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

ఉట్నూర్: ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజాఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 ఐఎన్‌టీయూసీ అనుబంధ ఆదిలాబాద్ జిల్లా నాయకులు కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే బొజ్జు నివాసంలో వైద్య ఆరోగ్యశాఖలో నెలకొన్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల రవీందర్, ముఖ్య సలహాదారుడు రాథోడ్ బాబులాల్, సంఘ సభ్యులు బొమ్మెత సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

తాంసిలో కందుల కొనుగోళ్ల ప్రారంభం

తాంసి, జనవరి 28: మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయం ఆవరణలో ఆదివారం కందుల కొనుగోళ్లను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించినప్పుడే వ్యవసాయంలో మంచి ఫలితాలు పొందుతారన్నారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలను ప్రభుత్వ రంగ సంస్థలకే అమ్ముకున్నట్లయితే మంచి లాభాలు ఉంటాయన్నారు. ప్రతి రైతు వ్యవసాయంలో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా మొదటిసారిగా కందులను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు, తదితరులు ఉన్నారు.

● 'ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి'

మావల: అర్ఎంపీ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అసెంబ్లీలో సైతం తప్పకుండా ప్రస్తావిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తెలంగాణ ఆర్ఎంపి అసోయేషన్ ఆదిలాబాద్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి వైద్యం అందిస్తున్న ఆర్ఎంపి డాక్టర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షులు రామోజీ వీరచారి, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కావటి రమేష్ యాదవ్, ఆర్ఎంపి డాక్టర్లు గజానంద్, మల్లయ్య యాదవ్, ఉమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయం : మాజీ మంత్రి


ఆదిలాబాద్ అర్బన్, జనవరి 28: తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నలంద జూనియర్ కళాశాలలో టీఏవీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్టుకి విశేష స్పందన వచ్చింది. ఇందులో 1500 మంది విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పేపర్ విడుదలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల పట్ల భయం పోగొట్టడానికి, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం, వారిని ఫైనల్ పరీక్షకు సన్నద్ధం చేసేలా టీఏవీఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్, కళాశాల యజమాన్యం ఉపాధ్యక్షులు విజయ్‌బాబు, జేవీపీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, రవీందర్‌రెడ్డి, విద్యార్థి జేఏసీ నాయకులు రాహుల్, వ్యవసాయ కార్మిక సంఘం నేత లంక రాఘవులు, తదితరులున్నారు.

'కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 28: ప్రధానమంత్రి ఉజ్వల పథకం నిరుపేదలకు వరం లాంటిదని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వకులాభరణం వేదవ్యాస్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని 34వ వార్డు శాంతినగర్‌లో సుమారు 40 కుటుంబాలకు ప్రధానమంత్రి ఉజ్వల్ పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను ఆయన అందజేశారు. ఇందులో బీజేపీ నాయకులు అజయ్, భూమన్న, ప్రవీణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8। కనిష్ఠం 11.0





● నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు



● ఇచ్చోడ సమీపం గుండా వెళ్తున్న ఎన్‌హెచ్ 44వ జాతీయ రహదారి



● ప్రధాన రోడ్డుపై పశువుల సంచారం ఇలా..

● రోడ్డుపక్కనే బస్‌షెల్టర్ వద్ద తాగునీటి కోసం చిన్నారి పాట్లు

అడుగడుగునా.. నిర్లక్ష్యం!

- జిల్లాలో 44వ జాతీయ రహదారి వెంబడి కనిపించని కనీస సౌకర్యాలు
- అలంకారప్రాయంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి మినీ ట్యాంకులు
- పట్టించుకోని నేషనల్ హైవే అథారిటీ
- భారీ వాహనాలు నిలిపే పరిసరాలు, బస్‌షెల్టర్ల వద్ద వృథాగా మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు
- టోల్‌ప్లాజాల బాదుడుతో వాహనదారులపై అదనపు భారం
- పశువుల సంచారంతో ప్రమాదాలు సంభవిస్తున్నా.. పట్టించుకోని యంత్రాంగం
- వచ్చే వేసవి దృష్ట్యా కనీస సౌకర్యాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలంటున్న వాహనదారులు, ప్రయాణికులు

ఇచ్చోడ, జనవరి 28: జాతీయ రహదారిపై దాహం తీర్చుకునే దారిలేదు.. మరుగుదొడ్లు, మూత్రశాలలకు తాళాలు వేసి ఉండడంతో ప్రయాణికులు అల్లాడుతున్నారు. నాలుగు వరుసల రహదారి నిర్మించిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు.. రహదారి వెంట అక్కడక్కడా ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అలాగే సేద తీరేందుకు షెల్టర్లను కూడా నిర్మించారు. కానీ వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వచ్చేది వేసవికాలం.. అపై మండిపోయే ఎండలతో ప్రయాణికుల గొంతు తడారిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు తాగునీళ్ల కోసం కిలోమీటర్ల మేర గుక్కెడు నీళ్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ సర్వీస్‌చార్జీగా టోల్‌ప్లాజా ఫీజును వసూలు చేస్తున్న అధికారులు.. దాననుగుణంగా సౌకర్యాలు కల్పించడం లేదంటున్నారు. నిబంధనల ప్రకారం జాతీయ రహదారిపై కనీస సౌకర్యాలతో పాటు రహదారి మరమ్మతుల బాధ్యతను రహదారి నిర్వహణ సంస్థలు చేపట్టాలి. కానీ నేరడిగొండ మండలం రోల్‌మామడ, జైనథ్ సమీపం వద్ద టోల్ ఫీజును వసూలు చేస్తున్నారు. కాదు కూడదంటే అడుగు ముందుకు వేయనివ్వడం లేదు. నిర్వహణ సంస్థలు ఆదాయంపై దృష్టి సారిస్తున్నంతగా.. కనీస సౌకర్యాల కల్పనపై చూపడం లేదు. దీంతో రహదారి వెంట ఉన్న చెట్ల కింద సేదతీరుతూ దాబా హోటళ్లలో తాగునీటి బాటిళ్లను కొనుగోలు చేస్తూ దాహం తీర్చుకుంటున్నారు. అలాగే మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో రహదారి పక్కనే వాహనాలను నిలిపి రోడ్డు పక్కనే మాలమూత్ర విసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయంటున్నారు. రహదారి నిర్వహణలో భాగంగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి తాగునీటి ట్యాంకులను నిర్మించినా.. ఫలితం లేకుండాపోయిందంటున్నారు.

అడ్డగోలుగా 'టోల్' బాదుడు!!

జిల్లా మీదుగా వెళ్తున్న 44వ రహదారిపై అడుగడుగునా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. సర్వీసు చార్జీల పేరిట అడ్డగోలుగా టోల్‌ప్లాజా ఫీజులను వసూలు చేస్తున్నా.. కనీస వసతులు మాత్రం నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి మినీ ట్యాంకులకు నీటిని సరఫరా చేయకుండానే, పైకప్పు అమర్చకుండానే వృథాగా గాలికి వదిలేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల తాగునీటి ట్యాంకులు శిథిలమయ్యాయి. దీంతో రహదారి వెంట ప్రయాణికులు పడరాని తిప్పలు పడుతున్నారు.

అలంకారప్రాయంగా 'వసతులు'

నిబంధనల ప్రకారం రోడ్డు నిర్వహణ సంస్థలు రహదారి వెంట ఉన్న భారీ వాహనాలు నిలిపే పార్కింగ్ స్థలాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేసినప్పటికీ.. అవి మాత్రం అలంకారప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు తలుపులకు తాళం వేసి ఉండడంతో నిరుపయోగంగా మారాయి. నేషనల్ హైవే అథారిటీ అధికారులు అటువైపు నుంచి ఎన్నిసార్లు ప్రయాణించినా పట్టించుకోకపోవడం గమనార్హం. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మరుగుదొడ్లు, మూత్రశాలలను వాడకంలోకి తీసుకువస్తే వాహనదారులకు వెసులుబాటు కలుగుతుంది. అంతేకాకుండా లారీలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు కేటాయించిన పార్కిగ్ స్థలాల్లోనే వారివారి వాహనాలను నిలుపుకుంటారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలపకుండా ఉండడమే కాకుండా ప్రమాదాలను నివారించవచ్చు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

జాతీయ రహదారికి ఇరువైపులా చాలా చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే మరికొన్ని చోట్ల మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడతో రహదారి వెంట ఆరుబయటే మలమూత్ర విసర్జన చేయడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయంటున్నారు. చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతాల్లో వాహనదారులు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్‌షెల్టర్ల వద్ద పారిశుధ్య పనులను చేపట్టకపోవడంతో ప్రయాణికులు షెల్టర్లలో నిలబడే అవకాశమే లేకుండాపోవడం విడ్డూరం.

పశువుల సంచారంతో ప్రమాదాలు

జాతీయ రహదారిపై అకస్మాత్తుగా పశువులు దారికి అడ్డంగా వచ్చేసరికి వందలసంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆందోళనలు చేపట్టినా.. సమస్య అలాగే ఉండిపోయింది. రహదారి మధ్యలో గల డివైడరుపై గ్రాసం కోసం గ్రామల దగ్గర ఉన్న పశువులు రోడ్లపై సంచరించడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్రమత్తత లేనప్పుడు పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రోడ్లపైకి పశువులు రాకుండా అరికట్టాలని వాహనదారులు పలుమార్లు కోరుతున్నా.. అట్టి విషయాన్ని అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

కనీస సౌకర్యాల కల్పనకు వెంటనే చర్యలు చేపట్టాలి

: పాన్‌పట్టే సాయికృష్ణ, వాహనదారుడు, ఇచ్చోడ



వేసవి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా అన్ని రకాల వసతులను కల్పించేలా చర్యలు చేపట్టేలా నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపట్టాలి. అక్కడక్కడా సర్వీసు రోడ్డు, బస్సు షెల్టర్ల వద్ద ఉన్న తాగునీటి మినీ ట్యాంకుల్లో నీటిని నింపి ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలి. సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. రానున్న వేసవి పరిస్థితులకు అనుగుణంగా రహదారిపై అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా సత్వరమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

సంక్షిప్త సమాచారం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

వాగ్ధారిలో కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు

నేరడిగొండ, జనవరి 28: నేరడిగొండ మండలంలోని వాగ్ధారి గ్రామంలో యువ మిత్ర యూత్ 3వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. కాగా ఈ పోటీలను ు ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ ఆదివారం సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని చాటాలని పేర్కొన్నారు.

1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

నేరడిగొండ, జనవరి 28: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నేరడిగొండలో ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వారు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ శలానాతరన్నమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులు హాల్‌టికెట్స్ కోసం కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలి : ఎస్‌డబ్ల్యూఎఫ్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 28: ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కారం అయ్యే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు డిమాండ్ చేశారు.ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆర్టీసీ కార్మికులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్టీసీలో కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు.

ఆట స్థలం నుంచి నాయకత్వ లక్షణాలు : ఆడె

బోథ్, జనవరి 28: ఆట స్థలం నుంచి నాయకత్వపు లక్షణాలు పెరుగుతాయని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. ఆదివారం ధన్నూర్ గ్రామంలో నిర్వహించిన నల్ల రాజు క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రుని జ్ఞాపకార్థం పెద్ద ఎత్తున నిర్వహించిన క్రీడా పోటీలు ఐకమత్యంగా నిర్వహించుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. 70 జట్లు క్రీడల్లో పాల్గొని ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి గెలుచుకున్న 2008 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌ను అభినందించారు. అంతేగాక రెండవ విజేతగా నిలిచిన కుచలాపూర్ జట్టు ఆట తీరును అభినందించారు. ఇందులో నల్ల శ్రీకాంత్‌రెడ్డి, బద్దం పోతారెడ్డి, ఇంద్రారెడ్డి వినయ్‌రెడ్డి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన అంతర్ రాష్ట్ర లింక్ రోడ్డు

● నిధులు మంజూరైనా.. ఇంకా ప్రారంభంకాని ఉమ్రి గోగర్వాడి రోడ్డు నిర్మాణం ● స్థానిక ఆదివాసీ గిరిజనులకు తప్పని తిప్పలు

తలమడుగు, జనవరి 28: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఉమ్రి గోగర్‌వాడి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినప్పటికీ.. ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభంకాక పోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్రి నుంచి గోగర్‌వాడ, మాండాబెల్లూర్ వరకు దాదాపు నాలుగు కోట్ల రూపాయల నిధులను అప్పటి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మంజూరు చేసి ఆ రోడ్డుకు ఆదివాసీ గిరిజన నాయకుడు పెందూరు లక్ష్మణరావు నామకరణం చేసినప్పటికీ.. ఇప్పటి వరకు రోడ్డు పనులు ప్రారంభంకాక పోవడంతో గిరిజనులు ఆదివాసీ గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే తెలంగాణ మహారాష్ట్ర వాసులకు రాకపోకలు మరింత పెరుగుతాయన్నారు. అంతేకాకుండా రైతులు పండించిన కూరగాయాలు ఇతర పంట దినుసులను మహారాష్ట్ర కన్వర్ట్ మార్కెట్‌కు తరలించి విక్రయించుకొని అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కానీ దేవుడు వరమిచ్చి పూజారి కనికరించినట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ.. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటి వరకు సదరు పనులను ప్రారంభించ లేదని పలు విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించాలని, త్వరగా అంతర్ రాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని గిరిజన గ్రామాల వాసులు కోరుతున్నారు.



ఉమ్రి నుంచి మహారాష్ట్ర గోగుర్‌వాడి వైపు వెళ్లే రోడ్డు ఇదే..

ఆదివాసీల చట్టాలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలి

● తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోడం గణేష్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 28: ఇంద్రవెల్లికి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసుల చట్టాల పై స్పష్టతను ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు గోడం గణేష్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అంతేగాకుండా గత ప్రభుత్వం 11 కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు సాగు, తాగునీరు అందుబాటులోకి తేవాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ఉట్నూర్, జనవరి 28: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు సాగునీరు, తాగునీరు అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని తాగు, సాగు నీరు, యూనివర్సిటీ, రైల్వేలైన్ సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ సమావేశానికి సీనియర్ నాయకులు భరత్ చౌహాన్ అధ్యక్షత వహించగా.. ఆత్రం భుజంగరావు భాను రామారావు, నేతావాత్ రాందాస్, రాథోడ్ గణేష్, జాదవ్ చంద్రకాంత్, బండి విజయ్‌కుమార్, రాథోడ్ శేషారావు, రాథోడ్‌గణేష్, తదితరులు మాట్లాడారు. దశాబ్దాల కాలంగా ఏజెన్సీ ప్రాంతాల రైతులకు సాగునీరు అందుబాటులో లేక కేవలం వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన నేటికీ గిరిజన గ్రామాల ప్రజలు మంచినీటి ఇబ్బందులు ప్రతిఏటా వేసవి కాలంలో ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రజల కోసం కౌటాల మండలంలో తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి కొమురంభీం ఆడ ప్రాజెక్టుకు అనుసంధానం చేసి లిఫ్టుల ద్వారా నీళ్లు చేర్చి ఏ జెన్సీ ప్రాంతాల ప్రజల అవసరాల కోసం సాగునీరు, తాగునీరు అందించాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా జిల్లాలోని ఉట్నూర్‌కు విశ్వవిద్యాలయం మంజూరు చేయాలని, ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, జన్నారం, దండెపల్లి, లక్షెటిపేటల మీదుగా రైల్వేలైన్ మంజూరు చేసి ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2న కేస్లాపూర్ వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సుభాష్, బోనకంటి, ముడుగు శ్యామ్యూల్, విజయ్‌కుమార్, రాథోడ్ సుధాకర్, జంగు, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌చౌహాన్



దేవతకు మొక్కుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఆదివాసీ గిరిజనుల సంస్కృతిని భావితరాలకు అందించాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఇంద్రవెల్లి, జనవరి 28: ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని భావితరాలకు పదిలంగా అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దొడంద గ్రామ సమీపంలో గల అటవీప్రాంతంలో కొలువు దీరిన ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి దేవతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జంగుబాయి దేవస్థానం వరకు రోడ్డు సౌకర్యం, నీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని హామీ నిచ్చారు. ఈ కార్య క్రమంలో ఆదివాసీ గిరిజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పలు భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన

తాంసి, జనవరి 28: తాంసి మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పలు పనులకు ప్రారంభోత్సవం చేశారు. హెల్త్ సెంటర్, రెడ్డికా, నాయీ బ్రాహ్మణ, రెడ్డి సంఘ భవనాల నిర్మాణాలకు కూడా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుల సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తనవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే సంఘంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గమనించాలన్నారు. యువత రాజకీయ రంగ ప్రవేశం చేయాలని అప్పుడే అభివృద్ధి మరింత సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్యే గెలిచిన తరువాత మొదటిసారిగా తాంసికి రావడంతో ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

తలమడుగు, జనవరి 28: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని సాయిలింగి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీ పథకాలతో వెంటనే రెండు లక్షల రుణ మాఫీని చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల ఆసరా పెన్షన్ ఇయ్యాలని కోరారు. గత ఎన్నికల సమయంలో సాయిలింగి శబరిమాత ఆలయానికి షెడ్డు మంజూరు చేసిన హామీ ఇచ్చానని, త్వరలో నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం వృద్ధులను ఆసరా పెంచిన వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, సర్పంచ్ రేవతి పొచ్చన్న, ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేదరేశ్వర్‌రెడ్డి, పిడుగు అభిరామ్‌రెడ్డి, ఉండం సర్పంచ్ నర్సింలు, రామకృష్ణ, తోట ప్రమోద్, దే వహూర్, సర్పంచ్ అబ్దుల్లా, పొచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.